అసమర్థుడు

బొంబాయి పట్టణములో - మూడంతస్తుల భవనములో-నాలుగు గదుల భాగము అద్దెకు తీసుకొని కుటుంబంతో ఉంటున్నాడు కరి రంగారావు. ముఖ కవళికలను బట్టి భావాలను తెలుసుకొనే సామర్థ్యమూ. మంచి శాంతమూ కలిగినవాడు. స్ఫురద్రూపి-మాట పైకి పొక్కనీయని నియమశీలీ కూడా.

కాపురం పెట్టిన ప్రథమంలో భార్యతోగూడా ఒక్కటే గదిలో ఉంటూ ఉండేవాడు. పెద్దరోడ్డు ప్రక్కకు ఉన్న కాలిబాటమీద కూర్చుని స్కూలు పిల్లలకు పుస్తకాలు అమ్మటం ప్రారంభించాడు క్రమేణ ఆ వ్యాపారము పెద్దదయి, అన్ని రకాల పుస్తకాలు దొరికే దుకాణమయి, పెద్దరోడ్డుమీద కేవలరామ్ బట్టల దుకాణము ప్రక్కకు 'కరి బుక్ హౌస్'గా మారింది. కొద్ది కాలానికే తృప్తికరమైన ఫలితము కనబడుతూ వచ్చింది.

ఇద్దరు పిల్లలతో భార్యతో-బొంబాయివంటి మహా పట్టణములో-మధ్య తరగతి జీవితము సాగిస్తున్నాడు. అక్కడి ఆంధ్రులలో పేరు తెచ్చుకుంటూ నలుగురిలో ఔ ననిపించుకుంటున్నాడు.

ఒకనాడు తలవని తలంపుగా, రంగారావుకు ఒక బంధువుతో హఠాత్సమావేశము కలిగింది. రంగారావును, ఆ పెద్ద షాపులో కూర్చుని ఉండగా చూసి, నమ్మలేకపోయినా బంధువు గుర్తుపట్టినప్పటికీ మాట్లాడదలచుకొనక ఊరుకున్నాడు రంగారావు.

"ఏమిరా! రంగా! నీవీ షాపులో నౌకరీకి ఉన్నావా? నిన్ను ఇక్కడ చూస్తున్నా నమ్మలేకుండా ఉన్నాను. నీ విక్కడ ఉన్నట్లు ఇంటికి కబురు చేయక పోయినావా?" అన్నాడు ఆశ్చర్యంతో.

"నేను గుమాస్తాగా లేను. నా స్వంత షాపే యిది. మనవాళ్ళకు తెలియజేయటానికేమి తొందర వచ్చింది ఇప్పుడు? ఇంటికి పోదాం రా!" అన్నాడు రంగారావు.

"మరి యిక్కడో?"

"నా చేతిక్రింద ఇద్దరు గుమాస్తాలు ఉన్నారు. వాళ్లు చూస్తూ ఉంటారు. మనము ఇంటికి వెళ్దాము."

తన ఇంటికి తీసుకొనివచ్చి భార్యాపిల్లలను ఆ బంధువులకు చూపించాడు.

వాళ్ళ ఉనికీ, ఇంటివైఖరీ చూసి బంధువు చాలా ఆశ్చర్యపడ్డాడు. తనపని ముగించుకొని మరో రెండు దినాలు వాళ్ళ దగ్గర ఉండి బయలుదేరాడు. ఆతన్ని సాగనంపుతూ, 'మంచిది ఉంటాను' అన్నాడు రంగారావు. ఆయన మాత్రము తల్లిదండ్రులకు ఎన్నో సంగతులు చెప్తాడని ఎదురుచూశాడు.

ఆరాత్రి భోజనాలదగ్గర మామగారి ప్రసక్తి తెచ్చింది జానకి. "బిడ్డలను చూపించినట్లుగా ఉంటుంది, ఒకసారి వెళ్దామా" అన్నది.

"ఈ ఊళ్ళో అందరికీ చూపించు.... ఆనందించు" అన్నాడు వికటంగా.

"మన మే స్థితిలోఉన్నా మనవాళ్ళు చూసి ఆనందిస్తేగాని ఆత్మకు సంతృప్తిగా ఉండదు. అక్కడికి వెళ్ళాలనీ, పిల్లలను అందరికీ చూపించాలనీ నాకెన్నాళ్ళనుంచో మనసులో ఉన్నది. నా కేమిటో వెలితిగా ఉన్నట్లుగా ఉంది" అన్నది జానకి.

"నీకు తెలియదు. చూసి సంతోషపడేవాళ్ళు అవతలఉంటే తృప్తిగా ఉంటుంది, మహాసంతోషంగానూ ఉంటుంది. లేకపోతే?" అన్నాడు.

"మనము పొరపడ్డామేమో? చూశారూ? ఎంతైనా కడుపు కదండీ! మీ పిల్లలు మిమ్మల్ని.... యీ విధంగా భావిస్తే మీ మనసుకెలా ఉంటుంది?"

"అదే పొరబాటు. నా పిల్లలను నేను పెంచుతున్న దృష్టితో.... మావాళ్ళు నన్ను పెంచలేదు. నాకొరకు ఖర్చుపెట్టే ప్రతిదమ్మిడీ 'వ్యర్థము చేశా'మని అనుకునేవాళ్ళు.... నాకు ఆ సంగతులు పదేపదే జ్ఞాపకము చేయవద్దు" అని చికాకుపడి అక్కడినుంచి లేచిపోయాడు.

ఎన్నిమార్లు బోధపరచినా జానకికి రంగారావు మాటలు అర్థం కావటము లేదు. మాతాపితల వాత్సల్యం మనిషికొక తీరా?

* * * * *

జగ్గయ్యశాస్త్రికి ముగ్గురు కూతుళ్ళు నలుగురు కొడుకులు, మొదట ఇద్దరు కొడుకులు-తరువాత వరుసగా ముగ్గురు ఆడపిల్లలు కావటమువల్ల పెద్దకొడుకులు ఇద్దరూ చేతికి వచ్చారు. భూ వసతి బాగా ఉండటమువల్ల మొగపిల్లలకు చదువులు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు.... సంసారపక్షంగా నిశ్చింతతో జరిపిస్తున్నాడు.

రంగారావు ఇంటర్మీడియేటు పరీక్ష కాగానే మెడికల్ కోర్సుకు వెళ్ళుతానని తండ్రితో చెప్పాడు. తనకిక దేనిలోనూ అభిరుచి లేదని నిక్కచ్చిగా తెలిపాడు. కాని జగ్గయ్యశాస్త్రికి మొదటినుంచీ రంగారావు తెలివితేటలమీద, శక్తిసామర్థ్యాల మీద అట్టే నమ్మకము లేదు. అదిగాక ఇతడు పుట్టిన మూడవ నెలలోనే తనతల్లి మారకము జరిగింది. అప్పటినుంచి ఒక మాదిరి జుగుప్స అతనికి తెలియకుండానే శాస్త్రి మనసులో ఉద్భవించి అభివృద్ధిచెందుతూవచ్చి రంగారావు జీవితంలో చాలా మార్పు కలుగజేసింది. అందువల్ల రంగారావు కొరకు ఖర్చుపెట్టేది వృధా ఖర్చు అన్న భావమేర్పడ్డది తండ్రికి మెడికల్ కోర్సును భరించలేననీ, ఇంకా చదువుకొనవలసిన పిల్లలున్నారనీ, నిర్మొగమాటంగా కొడుకుతో చెప్పాడు శాస్త్రి. దానితో రంగారావు మనసుకు విరక్తితోచి చదువు చాలించాడు. అంతకుముందే వివాహము అయివుండటమువల్ల తల్లిదండ్రులు ఈ సంగతి ఎక్కువ పట్టించుకో లేదు. తాను ముందు ఏమి చేయదలచుకొన్నదీ అతడెవరితోనయినా చెప్పటముగాని, ఇంట్లో అందరితో కలసిమెలసి ఉంటూ ఇంటి వ్యవహారాలు ఏవైనా తండ్రి చేతి క్రింద చూస్తూ ఉండటముగాని, జరుగలేదు. రంగారావు భార్య జానకి మాత్రము ఇంట్లో అత్తగారికి చేదోడు వాదోడుగా ఉంటూ చాలావరకూ అంతా సర్దుకొని పోయేది. తప్పించుకొని తిరిగే రంగారావుమీద ఉన్న కసి జానకిమీద తీర్చుకునే వారు. అతనేమిచేస్తున్నాడో-ఎక్కడికి వెళ్లతూ ఉంటాడో తెలుసుకోవాలన్న కుతూహలంతో కాక వెక్కిరింపుగా జానకిని అడుగుతూ ఉండేవారు. ఎవరెంత ప్రయత్నించినా జానకి బయట పెట్టేదికాదు.

ఒకరోజు అత్తగారు "ఏమిటేపిల్లా? ఉదయము ఎనిమిది గంటలకు వెళ్లి మధ్యాహ్నము 12 గంటలకు గాని రాడుకదా. భోజనానికయినా ఒకరితో కలవడు.

మధ్యాహ్నము మూడు గంటలకు వెళ్లి రాత్రి ఎనిమిదింటికి వస్తాడు. ఏమిటి వాడి సంగతి? ఈ తిరుగుబోతువాడికి ఆలోచనలేదూ? కూర్చోబెట్టి ఎవరు పెట్తారని అనుకుంటున్నాడు-మంచి ప్రయోజకుడే...." అంటూ మనసులోనిదంతా వెళ్ల గ్రక్కింది. కళ్లు తుడుచుకోవటము తప్ప జానకికి జవాబు తోచలేదు.

ఆరోజు జగ్గయ్యశాస్త్రి రెండవకొడుకు ఆనందరావు ఏలూరునుంచి వస్తున్నా డని ఉత్తరము వచ్చింది. ఏలూరులో వకీలుగా నాలుగేళ్లనుంచీ ప్రాక్టీసు చేస్తు న్నాడు. కోర్టుకు వేసవికాలపు సెలవులు కావటమువల్ల భార్యతో బయలుదేరాడు తండ్రిదగ్గరకి.

"ఏమే! ఆనందం ఎనిమిదింటికి వస్తాడు జ్ఞాపకముఉందా?" అని భార్యను హెచ్చరించాడు శాస్త్రి.

"అయ్యో! నాకేం మరపు? వాడికి గది సిద్ధంగా ఉంది. కాఫీ ఫలహారము కోడలు తయారుచేస్తోంది" అన్నది శాస్త్రి భార్య శాంతమ్మ.

"ఒరే రంగా! ఎక్కడికిరా వెళ్లుతున్నావు?" అని బైటికి వెళ్తున్న పెద్ద కొడుకును అడిగాడు.

"రోజూ వెళ్లేచోటికే. ఈ వేళ కొత్త ఏమున్నది? ఏం! పని ఏమయినా ఉన్నదా నాతో" అని కోటు సవరించుకొంటూ ఒక నిముషము ఆగాడు.

"పనేమిటి? ఆనందం వస్తున్నాడు ఎనిమిది గంటలకు, కార్డు చదువ లేదూ?"

"చదివాను. వస్తే ఉండేవాడేగా ఈ సెలవుల్లో? నేను పది గంటలకు తిరిగి రానేవస్తుంటిని" అని కదిలాడు.

"కాదోయి. స్టేషనుకు వెళ్లి రావాలి" అన్నాడు శాస్త్రి కాస్తగట్టిగా.

"నాకు పనిఉన్నది. వాడికి యిల్లు తెలియదా-ఊరు తెలియదా" అంటూ చరచర నడిచాడు రంగారావు.

'వాని పోకడ చూస్తున్నారా' అన్నట్లు భార్య- 'చూస్తూనే ఉన్నా' అన్నట్లు శాస్త్రి, ఒకరినొకరు చూసుకున్నారు.

ఇంతలోకే వాకిట్లో బండిఆగిన చప్పుడు ఆయింది. గడపలోకి ఎదురుగా వెళ్లి, కుశలప్రశ్నలు వేశాడు జగ్గయ్యశాస్త్రి కొడుకును. శాంతమ్మ లోపలికి తీసుకొనివెళ్లి, కొడుకు-కోడలు-సంసారము-ప్రసంగించి కాఫ్యాదులు ఇచ్చింది.

రాత్రి జానకి భోజనాల ఏర్పాట్లు చేస్తోంది. పీటలు చెంబులు సర్దుతూ ఉండగా శాంతమ్మ వచ్చి, "ఆనందానికి పెద్ద పీట తండ్రి దగ్గరగా వేసి ఆ వళ్లెం పెట్టు. వెన్న కరగవేశావా, ఉంచావా?" అంటూ వచ్చి వడ్డనలో భాగము తీసుకున్నది.

"రంగన్నయ్య రాడేం భోజనానికి? చిన్న పిల్లలంతా వచ్చారా?" అంటూ ఆనందరావు తనకొరకు వేసిన పీటమీద కూర్చున్నాడు.

"ఏదీ రంగడు, పిలువు" అంటూ శాస్త్రి కోడలిని లోపలికి పంపాడు. వెళ్లిన రెండు నిమిషాలకు జానకి తిరిగివచ్చి "అత్తయ్యా? పడుకున్నారు. ఇప్పుడు రారుట. అందరి భోజనాలు కానివ్వమని అంటున్నారు" అన్నది.

"తన సంగతి చెప్పమను? అందరికి సలహాలు ఇవ్వ నక్కర్లేదు. తన కోసము ఇక్కడెవరూ కనిపెట్టుకొని కూర్చోలేదు" అంటూ శాస్త్రి ముఖమవతలికి తిప్పుకున్నాడు.

ఆనందము వచ్చిన దగ్గర్నుంచి రంగారావు గదిలోనుండి ఇవతలికి రావటము, మాన్పేశాడు. బయటనుంచి రావటము,గదిలోప్రవేశించటము,జరుగుతోంది.

భోజనానంతరము శాస్త్రి ఆనందరావుతో "మీ అన్నయ్య సంగతి నాకేమీ బోధపడటము లేదురా.తన సంగతి ఒకరితో చెప్పడు-ఒకరి సంగతి తాను పట్టించుకోడు. ఇంటరు ప్యాసయినాడుకదా.నలుగురు పిల్లలకు చదువు చెప్పినా బాగుండును అదీ కాకపోతే నా చేతిక్రింద పొలం పనులు చూస్తూ ఉన్నా బాగుండును. పరో జీవిని అత్తవారింటినుంచి పిలిపించాలి. మనలోఎవరయినా వెళ్ళి తీసుకొనిరావాలి. వేలకువేలు సంపాదించేవాడికైనా తీరుబడి ఉంటుంది కాని వాడికి తీరిక లేదు" అని ఏదో కష్టం సుఖం చెప్పుకున్నట్లుగా అన్నాడు.

"అవును, నాకు తీరుబడి ఉంటే నేనే వెళ్ళేవాడిని. మొన్నటివరకు కోర్టులో పని చేసివచ్చానా? నాకు కొంచెము విశ్రాంతి కావాలి. అయినా తాను ఊరికేనే ఉన్నాడుగా?" అన్నాడు ఆనందరావు.

"నీమాట కాదురా. వాడి సంగతే చెప్తున్నాను. ఇంట్లో ఉన్న మనిషి ఇంటి బాధ్యత పట్టకుండా తిరుగుతూ ఉంటే ఎంతని సహించను? పోనీ సంపాదనఆయినా ఉంటే అనుకోవచ్చు. వాడిని వాడి భార్యను కూర్చోబెట్టి పెట్టాలి. అందులో ఇప్పుడామె గర్భిణి, ఇక వరుస సాగిస్తుంది ఇల్లునిండేవరకూ" అన్నాడు శాస్త్రి.

"ఓహో! అదా?" అన్నాడు హేళనగా ఆనందరావు.

"వంశాభివృద్ధి వీరివల్లనే కావాలి. లేకపోతే ఆగిపోతుంది. ముందు తమకిద్దరికి జీవనోపాధి లేదుగాని...."

ఇంతలోకి జానకి మంచినీళ్ళు తమలపాకులు తెచ్చి మామగారి బల్లమీద పెట్టటానికి వచ్చింది. జగ్గయ్యశాస్త్రి వాక్యంపూర్తి చేయలేక, "పొద్దు చాలగడిచింది ఆనందూ! పడుకో" అంటూ లేచాడు.

రాత్రి పదిగంటల సుమారుకు రంగారావు భోజనం చేశాడు. తమలపాకులు అందిస్తున్న భార్య ముఖం, లాంతరు పైకెత్తి చూశాడు.

"జానూ, జలుబు చేసిందా, మాట భారంగా ఉంది?" అన్నాడు రంగారావు జానకి నీళ్ళు కారిన తన కళ్ళను, ముఖాన్ని కనబరచకుండా తల వంచుకున్నది.

*　　*　　*　　*

ఆ సెలవుల్లో మూడవకొడుకును పంపి కూతురిని అల్లుడిని పిలిపించాడు శాస్త్రి. పండుగలాగ ఇల్లు పచ్చగా నలుగురితో కలకలలాడుతున్నది. శాస్త్రిగారి భార్యకు తీరికే లేదు పిల్లలతో.

కాఫీ త్రాగిన తరువాత అంతా కబుర్లలో పడ్డారు

సరోజినికి జానకి జడ వేస్తున్నది. ఆమె అత్తవారింటి కబుర్లు వదినగారయిన జానకితో చెప్పటము మొదలుపెట్టింది.

"వదినా, పెళ్ళిలో నగలు పెట్టకుండా డబ్బు యిస్తామని తరువాత చేయించుకుంటామంటే ఎవరికీ మనసొప్పదు. నాసంగతి చూడు. నగల క్రింద యిచ్చినవేగా రూపాయలు? ఏదైనా చేయించుకుందామంటే ఇక ఆయన ఒప్పటంలేదు-

అక్కడ వాళ్ళు ఒప్పటంలేదు. నాకు విసుగ్గా ఉంది. చేతిగాజులు రెండుతీసి, నెక్లేసు చేయించుకుందామని అనుకుంటున్నాను. ఏమంటావు? అవునుగాని, నీచంద్ర హారము నెక్లేసు పెట్టుకోవెందుకమ్మా. ఇక్కడున్నాయా మీ వాళ్ళింట్లో ఉన్నాయా'' అన్నది సరోజిని.

"లేదమ్మా ఇక్కడే ఉండాలి'' అంది అశ్రద్ధగా.

"తీసుకురావమ్మా. మేమంతా ఉన్నప్పుడయినా పెట్టుకో. ఏమిటీ యింత అశ్రద్ధ?'' అని గట్టిగా బలవంతము చేసింది.

జానకి తాళపుచెవులు తన దగ్గర లేవని బొంకింది. కాని సరోజిని నిలవదీసి అడిగేసరికి, "మీ అన్నయ్య తన పెట్టెలో పెట్టుకున్నారు రెండు నెలల క్రిందట తరువాత నేను అడగనూ లేదు, వారు ఇవ్వనూలేదు. అయినా నాకు నగలమీద అంత అపేక్ష లేదమ్మా'' అని జానకి నిజము చెప్పేసింది. 'అయ్యో!' అని బుగ్గలు నొక్కుకుంటూ సరోజని శాంతమ్మగారితోను, శాంతమ్మగారు శాస్త్రిగారితోను-ఒక నిముషంలో ఈ వార్తను వెల్లడిచేశారు. అప్పటికప్పుడే పెద్ద హంగామా జరిగి పోయింది.

"అయితే ఏం చేసినట్లు వాటిని? ఏమే జానకీ! ఇంట్లో పెద్దవాళ్ళముఉన్నాము కదా, చెప్పకుండా ఏమిటాపని? అడుగుతున్నాడని మాటమాత్రమూ మాచెవినవేయ గూడదా?'' శాస్త్రి రుద్రుడయినాడు. జవాబిచ్చే ధైర్యము లేకపోయింది జానకికి.

"బెల్లము కొట్టిన రాయిలాగ మాట్లాడవేమిటి? నన్ను అడగకుండా ఎందుకు ఇచ్చావు? నీవు సామాన్యురాలివా? అసలు నీవే మావాడిని ఎందుకూ పనికిరాకుండా చేశావు. ఇదంతా నీమాయే!'' అంటూ శాంతమ్మ చేతులు చాపుతూ జానకి మీదికి వెళ్ళింది.

జానకి పెద్ద చిక్కులో పడింది భర్తదగ్గర తన నగలు ఉన్నాయని తాను చెప్పటంలో, భర్త అడగగానే త్యాగబుద్ధితో అనుకూలవర్తినిలాగ వెంటనే ఇచ్చి వేసిందని తనకు మెప్పు రాకపోగా, కానీ సంపాదన లేకుండా భార్యాసహితంగా ఉంటూ భారమనిపిస్తున్న రంగారావు ఈ నగలన్నీ అమ్మి పాడుచేశాడన్న కోపము వాళ్ళందరికీ కలిగింది. కూర్చుంటే తప్పుగానూ, నిలబడితే అపరాధంగానూఉన్నది. పెద్దకొడుకు అన్న గౌరవము పీసమంతైనా కనబడలేదు.

"అవి నా నగలు కనుక వారు అడగగానే ఇచ్చాను. వీటిని ఏం చేస్తారని నేను నిలవదీసి వారినడుగలేదు. నా అంతరాత్మ వారిని సందేహించదు." ఊపిరి బిగబట్టుకొని జేవురించిన ముఖంతో చెప్పలేక చెప్పింది జానకి

"ఆహాఁ ఇంతవరకూ వచ్చిందీ నీసంగతి కూడా? మూగదేవతలాగ ఉన్నట్లే ఉండి, ఎంత పని చేశావు? ఆ నగలు నీవనుకున్నావా? శ్యామమోహన్ పెళ్ళికి ఉపయోగపరచాలని అనుకున్నాను అయ్యో! ఎంత పని జరిగింది!"

దొంగలుపడి సర్వమూ దోచుకున్న తరువాత కలిగే పరితాపము కలిగింది వాళ్ళకు. కళ్ళు తుడుచుకోవటానికి జానకి గదిలోకి వెళ్ళింది.

ఆ రాత్రి భోజనాల సమయానికి అయిదునిముషాల ముందర రంగారావు కూడా భోజనాల ఇంట్లోకి వెళ్లాడు.

"రంగా నీవు ఇటురా. అక్కడ బావగారు, ఆనందు కూర్చుంటారు. నీవు ఇటుప్రక్క పీటమీద కూర్చో" అంటూ తల్లి పిలిచింది. అందరికి వెండిపళ్ళేలు పెట్టి, తనకు ప్రత్యేకంగా విస్తరి వేసింది తన తల్లి! కూర్చున్నట్లే కూర్చుని తన గదిలోకి వెళ్ళి చూసేసరికి తన సామాను ఆ గదిలో లేవు! తన పెట్టె, బట్టలు బయట వరండాలో ఒక మూలకు పడిఉన్నాయి. తన మంచముమీద బావమరదికి పక్క వేశారు. ఇంకో గదిలో తమ్ముడు మరదలు! ఒకదాంట్లో తండ్రి సామాను పుస్తకాలు ఉన్నాయి. మరొకటి తల్లి చిన్న పిల్లలు! ఇంక ఆ ఇంట్లో తనకే గదీ లేదు-స్థలము లేదు!

చివాలున లేచి బయటికి వెళ్ళి బండి తెచ్చి వాకిట్లో నిలబెట్టాడు. తన సామానులన్నీ అందులో పెట్టించాడు. వడ్డించి చేతులు కడుక్కుంటున్న జానకిని మాట్లాడనీయకుండా బండి ఎక్కించాడు. బండి నిముషాలమీద కదిలిపోయింది. ఇదంతా జరగటానికి అయిదు నిముషాలన్నా పట్టలేదు.

పీటమీదనుంచి రంగారావు ఎందుకు లేచాడో ననుకున్నవాళ్లకు- అప్రయోజకుడివల్ల ఇంతపని జరుగుతుందని తోచలేదు. వంట ఇంట్లోనుంచి నేతిగిన్నె తీసుకొని జానకి ఇంకా రాదేమని పిల్లలు పెద్దలు కేకలు పెట్టారు. శాంతమ్మ వంట ఇంట్లోకి పోయి చూసింది. పిల్లలు లేచి ఇల్లంతా వెతికారు. "అన్నయ్య కూడా లేడు ఏదో బండిచప్పుడవుతోంది వీథిలో" అన్నారు పిల్లలు.

కుండెడు పాలు విరిగినందువల్ల గృహిణికి కలిగేసంచలనమన్నా కలుగలేదు శాంతమ్మకు

"ఎక్కడికి వెళ్తారు? అత్తవారు మాత్రము ఇటువంటి వారిని నెత్తిన పెట్టుకొని చూస్తారా?" అనుకొని అందరూ తలకొకమాట అన్నారు. అంతే దుష్టాంగము దానంతట అదే ఛేదించుకొనిపోయినంత హాయి ననుభవించాడు శాస్త్రి.

* * * *

ఆరు సంవత్సరాలు గడచిపోయాయి. బొంబాయిలో రంగారావును అతని బంధువు అకస్మాత్తుగా కలుసుకోవటము తటస్థించిన తరువాత జగ్గయ్యశాస్త్రి దగ్గర్నుండి ఒక ఉత్తరము వచ్చింది రంగారావుకు.

"చి. రంగారావును పుత్రపౌత్రాభివృద్ధిగా దీవించి వ్రాయునది ఏమనగా:- నీవు భార్యాసమేతంగా బొంబాయిలోఉంటూ పుస్తకాల దుకాణం పెట్టినట్లు మన సుబ్బారావువల్ల తెలిసింది. నీ పిల్లలు నీస్థితి అంతా చెప్పాడు. చాలా సంతోష మయినది. అ. మీ అమ్మ. నీ తమ్ముళ్ళు, నిన్ను చూడాలని అనుకుంటున్నారు. నేను కూడా పెద్దవాణ్ణి అయ్యానుకదా నీ బిడ్డలను తీసుకొనివచ్చి చూపించు. క్షేమం వ్రాయి.

ఇట్లు
జగ్గయ్యశాస్త్రి వ్రాలు.

అది చదువుకుని తిరుగుటపాలో రంగారావు తండ్రికి జాబు వ్రాశాడు.

"బ్రహ్మశ్రీ నాయనగారికి-నమస్కారములు. మీరు వ్రాసిన జాబు చేరింది నేను ఇక్కడికి వచ్చి పుస్తకాల వ్యాపారము పెట్టుకున్నాను. వివరాలు సుబ్బారావు వల్ల మీకు తెలిసే ఉంటాయి. మీ సంతానంలో నేను ఒక అప్రయోజకుడివలె ఎంచబడ్డాను. నా సోదరీ సోదరులమధ్య నేను- అసమర్థుని స్థానము ఆక్రమించుకొని- జీవచ్ఛవంవలె ఉండలేక పోయినాను. నాకభిరుచిగల వృత్తిలోకి మీరు పోనివ్వలేదు. అక్కడ ఉన్నప్పుడే ప్రక్కగ్రామంలో హోమియోపతివైద్యముచేసి చూశాను. రాబడి తృప్తికరంగా లేక, జానకి నగలన్నీ అమ్మి వేసి. షాపు పెట్టాను.

ఆదాయం తృపికరంగానే ఉంది. ఇక్కడికి వచ్చిన తరువాత ఇద్దరు బిడ్డలు పుట్టారు. అయినప్పటికీ నాకు ఏవిషయంలోనూ పెద్దల ఆశీర్వచనము లేదు. నేను నా పుట్టుకతో ఎరుగని ఆత్మగౌరవము ఇక్కడికివచ్చి సంపాదించాను. ఆ ప్రాంతాలకు నేను ఇప్పుడు వచ్చి గడచిపోయిన నాజీవితము జ్ఞాపకము తెచ్చుకొని బాధపడలేను. అయినా నేనుమాతృపితృఋణము తీర్చవలసియున్నది. పిల్లలకొరకు నెలకు ఏభయి రూపాయలు పంపుతూ ఉంటాను, సెలవు. ల. అమ్మగారికి నమస్కారములు.

ఇట్లు
రంగారావు"

ఉత్తరము చదువుకొని జగ్గయ్యశాస్త్రి ముఖము ముడిచాడు. 'చెప్పుడుమాటలు తల కెక్కినాయి. అయినా అడ్డాలప్పుడు బిడ్డలుగాని గడ్డాలు వచ్చిన తరువాత బిడ్డలుకారు' అంటూ శాంతమ్మ కొంగు దులుపుకున్నది.